కథ

''ఐ లవ్ యూ! నిన్ను నేను ప్రేమిస్తున్నాను''
''మై తుమ్‌సే ప్యార్ కర్‌రూమ్... అని కూడా అను. ముచ్చటగా మూడు భాషల్లో చెప్పినట్లవుతుంది.''

# ప్రేమ

ఆ అవహేళనకు షాక్ అయ్యాడు సమీర్.

''నేను సీరియస్‌గా చెబుతున్నాను''

''నేనూ సీరియస్‌గానే వింటున్నాను.''

''అయితే ఏమిటి నీ సమాధానం..?''

''దేనికి సమాధానం కావాలి నీకు''

''నా ప్రేమకు''

''నేను నీకు సమాధానం చెప్పేముందు నువ్వు నా ప్రశ్నకు సమాధానం చెప్పాలి''

''ఏమిటది?''

''నీకు నన్నే ప్రేమించాలని ఎందుకనిపించింది?''

''నువ్వు అందంగా వుంటావు గనుక..''

''అలా అయితే నన్నెందుకు ప్రేమించటం? ఏ ఐశ్వర్యారాయ్‌నో, సుస్మితాసేన్‌నో, ఏ లారాదత్తానో ప్రేమిస్తే సరిపోయేదిగా. ఒకవేళ వాళ్ళు నీకు అందుబాటులో ఉంటారో లేదో అనిపిస్తే, ఈ భారతదేశంలో ఇంకా చాలామంది అందమయిన అమ్మాయిలున్నారు. వాళ్ళలో ఎవర్నయినా ప్రేమించవచ్చుగా..'' సూటిగా అతని కళ్ళళ్ళోకి చూస్తూ అంది అపూర్వ.

తనేదో పొరపాటు మాట్లాడానని నాలుక కరుచుకున్నాడు సమీర్.

''అందమంటే... అది..అది..ఒక్కటేకాదు. నువ్వంటే నాకు ప్రేమ..''

''మళ్ళీ అదే మాట. సినిమాలు బాగా చూస్తావా?''

''ఎందుకు?''

''ఈ మాట సినిమాల్లో ఎక్కువగా వినిపిస్తుంటుంది కదా, అందుకని అడిగాను. ప్రేమలేఖలు రాసుకోవడాలూ, పార్కుల్లో ప్రేమపాటలు పాడుకోవడాలూ, అమ్మానాన్నలు కాదంటే లేచిపోవడాలూ, ఏ విలనో వచ్చి మూతిపగలగొడితే ప్రేమకోసం రక్తం చిందించడాలూ... ఇవేగా ఈనాటి సినిమాలు. మూడు గంటలసేపు..సినిమా జోరీగ 'ప్రేమ..ప్రేమ..లవ్..లవ్' అంటూ ఎన్నిసార్లు రణగొణధ్వని చేస్తుందో..అబ్బ..ఎంత న్యూసెన్సో చెప్పలేను.''

''ప్రేమించడం తప్పంటావా అపూర్వా''

''ఆ మాట నేనెందుకంటాను. ఈ ప్రపంచమంతా ప్రేమమయం. ప్రేమ లేనిది మనిషి లేడు. ప్రేమలేనిది ఈ ప్రకృతి లేదు. ప్రేమించు... నేను కాదనను. నిన్ను కన్న నీ తల్లిని ప్రేమించు. నీ తోడబుట్టిన చెల్లాయిని ప్రేమించు. ఇంకా... నీ కుటుంబాన్ని, నీ రాష్ట్రాన్ని, నీ దేశాన్ని... విశాల హృదయం వుంటే ఈ మొత్తం ప్రపంచాన్నీ ప్రేమించు''

''ఇన్ని ప్రేమల గురించి చెప్పావుగానీ భార్య గురించి చెప్పలేదు. జీవిత భాగస్వామిగా రాబోయే భార్యను ముందు ప్రేమించి, తరువాత పెళ్లి చేసుకుంటే మంచిదేగా..'' చాలా తెలివిగా మాట్లాడాననుకుంటున్న అపూర్వ మాటల్లో నుంచి ఒక మంచి పాయింట్ లాగగలిగినందుకు లోలోన ఆనందపడుతూ అన్నాడు సమీర్.

''మంచిదో చెడ్డదో ఆ విషయం తర్వాత. కానీ నేను ఆ ప్రేమను కావాలనే పక్కకు పెట్టి మాట్లాడాను. ఎందుకంటే 'సెమాంటిక్స్' అని ఒక సబ్జెక్ట్ వుంది. తెలుగులో దాన్ని 'అర్థపరిణామము' అంటారు. కాలగతిలో కొన్ని మాటలు అర్థసంకోచం చెంది కుంచించుకొనిపోతాయిట. 'ప్రేమ' అన్న పదానికి వున్న విశాలార్థాన్ని నేటి యువతరం కుంచింపచేసి 'ప్రేమ' అంటే కేవలం యువతీ యువకుల మధ్య ఉండే ఆకర్షణ అని అర్థం వచ్చేలా చేస్తోంది. ఆ రకం ప్రేమ నీకు బాగా తెలిసిందే గనుక 'అదొక్కటే కాదు' అనే అర్థం వచ్చేలా నేను ఇతర ప్రేమల గురించి చెప్పాను..''

సమీర్‌కు చిరాకు కలిగింది. అపూర్వ మీద కోపం కూడా వచ్చింది.

''ప్రేమ విషయంలో నీకున్న పరిజ్ఞానం నాకు లేదని ఒప్పుకుంటున్నాను. అంతేకాదు మాటల్లో నేను నీతో గెలవలేనని కూడా ఒప్పుకుంటున్నాను. కనుక నీ లెక్చర్లు ఆపి నా ప్రశ్నకు జవాబు చెప్పు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా లేదా?''

అపూర్వ వస్తున్న నవ్వుని ఆపుకుంది బలవంతాన.

''ఎందుకు నవ్వుతున్నావ్?''

''నాకు ఆకలేస్తోంది గనుక నేను అన్నం తింటున్నాను. నువ్వూ నాతో తింటావా లేదా? అన్నంత రొటీన్‌గా ఈ డైలాగు వుంటేనూ నాకు నవ్వొచ్చింది.''

''అపూర్వా! బీ సీరియస్''

''నేను మొదట్నుంచీ సీరియస్‌గానే వున్నాను. సీరియస్‌గానే మాట్లాడుతున్నాను. నీ మాటలే నాకు పిల్ల ఆటలుగా, ఆకతాయిల అల్లరిగా అనిపిస్తే అలా అన్నాను.''

''ప్రేమ అంటే..పిల్ల ఆటలు అంటావేంటి?''

''కాదనే నేనూ చెప్పేది. ఎందుకంటే నీలా నన్ను 'ప్రేమిస్తున్నాను', 'ఐ లవ్ యూ' అని చెప్పినవాళ్ళు, ఆ విషయం చీటీల మీద రాసి పంపినవాళ్ళు ఇంతకుముందు తక్కువలో తక్కువ ఓ డజను మందైనా వుంటారు.


ఇక కన్నుకొట్టినవాళ్ళు, ఫ్లయింగ్ కిసెస్ ఇచ్చినవాళ్ళయితే కోకొల్లలు. ఇదాంతా నిత్యం చూస్తుంటే నాకనిపిస్తుంది... ప్రేమంటే ఇంత చీపా, లవ్ అంటే..ఇంత వెకిలితనమా అని..''

''అంటే..అంటే..నీ ఉద్దేశం నా ప్రేమ చీప్ అనా..''

''నిన్ను గురించి నీ ప్రేమ సాంద్రత గురించి నేనంత డీప్‌గా స్టడీ చేయలేదుగానీ నాకు మాత్రం నిన్ను చూసినప్పుడు, నీతో కలిసి మాట్లాడినప్పుడు 'ఇన్నర్ ఫీలింగ్స్' ఏమీ కలగలేదు. ఆర్.టి.సి. స్ట్రయిక్ అప్పుడు నిన్ను లిఫ్ట్ అడిగి నీ స్కూటర్ మీద కూర్చోవడం, నీతో కలిసి హోటల్లో కాఫీ తాగడం, నీతో నవ్వుతూ జోవియల్‌గా మాట్లాడడం ఇవే ప్రేమంటే అని నువ్వనుకుంటే అది నా తప్పుకాదు. నేను మాత్రం దాన్ని 'స్నేహం' అనుకుంటున్నాను. స్నేహానికి ప్రేమ ముసుగు కప్పి దాని అర్థాన్ని, అందాన్ని పాడు చేస్తానంటే... బహుశా ఇదే మనం ఆఖరిసారి కలుసుకోవటం అవుతుంది'' తడబాటు, మొహమాటం వంటి అడ్డంకులు లేకుండా అంత ఖచ్చితంగా చెబుతున్న అపూర్వవంక ఆశ్చర్యంగా చూసాడు సమీర్.

''సారీ అపూర్వా! నీ మనసు అర్థం చేసుకోలేక ఇంతవరకు నా మాటలతో నిన్ను బాధపెట్టినందుకు రియల్లీ సారీ. నీ మనసులో మరెవరో వున్నారని తెలియక..''

''ఎత్తిపొడుపులొద్దు సమీర్. ఫ్రాంక్‌నెస్ తప్ప డొంక తిరుగుళ్ళు, గుంభనపు మాటలు నాకు నచ్చవు. నువ్వనుకున్నట్లు నేనెవర్నీ ప్రేమించటం లేదు. 'ప్యార్ కియా నహీ జాతా, ప్యార్ హోజాతాహై' అని ఎవరో కవి అన్నట్లు భవిష్యత్తులో అలాంటి వ్యక్తి ఎవరయినా తారసపడి నా



హృదయం స్పందిస్తే అతన్ని ప్రేమ వివాహం చేసుకోవటానికి వెనుకాడను. అలా జరగకుంటే శుభ్రంగా మా అమ్మా, నాన్నలు కుదిర్చిన అబ్బాయిని నాకూ నచ్చితే పెళ్ళి చేసుకుని ఆ తరువాత ప్రేమించటం మొదలుపెడతాను. ఈ రెండు పద్ధతుల్లో ఏవిధంగా నా పెళ్ళి జరిగినా... నీకు ఇన్విటేషన్ పంపిస్తాను. పెళ్ళికి తప్పక రావాలి. నిన్ను ప్రేమించలేదని అలిగి రాకుండా మానెయ్యవు కదా'' నవ్వుతూ సమీర్ చేతిని తన చేతిలోకి తీసుకుని స్నేహపూర్వకంగా నొక్కుతూ అంది అపూర్వ.

ఆ స్పర్శ కొత్తగా అనిపించింది సమీర్‌కు.

ఆ కొత్తదనంలో మనోవికారాలు కాక ఏదో-మరేదో ఆత్మీయతా భావం స్పృశించి అతన్ని ఆశ్చర్యపరిచింది.

★★★

''అక్కా! ఇప్పుడు నీ వయసెంతే?''

''ఎందుకు?''

''ఎందుకో ఒకందుకు..చెప్పు..''

''ఇరవై ఆరు.''

''ఇంకేముంది, నువ్వు వృద్ధ కన్యవైపోతున్నావ్. నీ వెనకనే నేనూ తయారవుతున్నాను. నాకన్నా ఒక్క ఏడాది ముందు పుట్టినందుకు నన్ను నానా బాధలుపెడుతున్నావ్ కదే...''

''నేనేం చేసానే?''

''ఇంతకన్నా ఇంకేం చేయాలి? నువ్వు పెళ్లి చేసుకోవు..నీకు కాందే అమ్మానాన్నలు నాకు పెళ్ళి చేయరు..'' తమాషాగా తలపట్టుకొని కూర్చున్న చెల్లెలు అర్పిత నెత్తిన ఒక్క మొట్టికాయ వేస్తూ-

''ఏమిటంత తొందర?'' అంది అపూర్వ.

''తొందర నాది కాదు..నా లవ్వర్‌ది. నేనూరుకున్నా అతనూరు కోవద్దూ.''

**డా. కొఠారి వాణీ చలపతిరావు**

ఆ మాటలకు చటుక్కున తలతిప్పి చెల్లెలి వంక చూసింది అపూర్వ.

''లవ్వరా? ఎవరతను? నీకో లవ్వరున్నట్లు నాకెప్పుడూ చెప్పలేదే..''

''ఎలా చెప్పను ప్రేమ కాస్త పాకానపడందే..''

''పాకాన పడటం అంటే..''

''కాస్త అడ్వాన్స్ స్టేజ్‌లోకి రావడం అని అర్థం. ప్రేమ ద్వేషివి. త్వరలో ముసలి బ్రహ్మచారిణివి కాబోతున్న దానివి. నీకేం అర్థమవుతుందిలే. పుసుక్కున కాలుజారి ఏ కడుపో రాకముందే మూడుముళ్ళు వేయించుకుంటే మంచిదని నేను ఆరాటపడుతుంటే, నువ్వేమో నాకు అడ్డంగా తిష్టవేసుకుని కూర్చుంటివి..''

''అర్పితా!'' రూమ్ దద్దరిల్లిపోయేలా ఒక్కసారిగా కోపంతో గట్టి కేక పెట్టింది అపూర్వ.

ఊహించని ఆ పిడుగుపాటుకు అదిరిపడింది అర్పిత.

''ఇలా... ఇంత అసహ్యంగా మాట్లాడుతోంది నువ్వేనా. నా చెల్లెలు అర్పితేనా? నీకు అంత తొందరగా వుంటే నాకన్నా ముందు నువ్వు పెళ్ళి చేసేసుకో. అమ్మానాన్నలతో నేను చెబుతాను. అంతేగానీ ప్రేమ పేరుతో తిరుగుళ్ళు తిరిగి వాడు మోసం చేస్తే-ఏడుస్తూ, మరొకడ్ని నువ్వు మోసం చేసి మొగుడిగా కట్టబెట్టుకుని..ఈ ఇంటికీ..నిన్ను కన్నవాళ్ళకూ అప్రతిష్ట తీసుకు

రాకు..''


''అక్కా... నేను చెప్పేది..''

''నువ్వు నాకేం చెప్పొద్దు. నామీద నీకు ఏమాత్రం గౌరవం వున్నా నేను చెప్పేది విను. ప్రేమంటే కేవలం శారీరక ఆకర్షణ కాదు. ప్రేమంటే ముద్దులు, కౌగిలింతలు, కాలుజారడాలు కాదు. అది వ్యామోహం. ఆ వ్యామోహంలో పడే నా స్నేహితురాలు ఒకమ్మాయి టీనేజ్‌లోనే తనని తాను ఆహుతి చేసుకుంది.

## కొత్త అవకాశాలు!

కవ్వించే అందాల సంఘవి జోరు ఈమధ్య తెలుగులో కాస్త తగ్గిందనే చెప్పుకోవాలి. అయితే తమిళంలో కొన్ని సినిమాలు చేస్తోందిట. వాటితోపాటు తెలుగులో 'పరశురాం' సినిమాలో శ్రీహరికి జోడీగా నటిస్తోంది సంఘవి. ఈ సినిమా ఆమెకి మరిన్ని కొత్త అవకాశాలను తెచ్చిపెడుతుందేమో!

-మానస



అప్పుడు దానికి పదహారేళ్ళు. ప్రేమంటే సరదాకి పదే పదే ఉచ్చరించే ఊతపదం కాదు. దాన్ని గురించి సరైన అవగాహన లేకుండా అడుగుముందుకేస్తే ఊబిలో కూరుకుపోతావు అని హెచ్చరించాను. నేనూ దాని వయసుదాన్నే అయినా ఎందుకో నా ఆలోచనలు, భయాలు ఆరోజుల్లోనే అలా వుండేవి. అది నేను చెప్పిన మాట వినలేదు. ఊబిలో కాలు పెట్టింది. జీవితాన్ని సర్వనాశనం చేసుకుంది. ఆ మోసగాడి ఆకర్షణలో చిక్కుకుని కన్యాత్వం కోల్పోయి, మాతృత్వపు ఛాయలు కనిపించగానే... లోకానికి భయపడి ఆత్మహత్య చేసుకుంది. అలా అదొక్కతే కాదు. ప్రతినిత్యం ఈ సమాజంలో రోజుకొకటి..పూటకొకటిగా ప్రేమకు బలైపోతున్న ఆడపిల్లల్ని గురించి చదువుతున్నాను, వింటున్నాను. చిన్నదానివయినా నీకు చేతులెత్తి దండం పెట్టి ప్రాధేయపడుతున్నాను. నువ్వూ అలా మాట్లాడి నన్ను భయపెట్టకే''

ఈదురుగాలిలో సన్నజాజి తీగలా భయంతో వణికిపోతున్న అక్కను చూసి ఆశ్చర్యంతో దగ్గరికి వెళ్ళి రెండు చేతులూ పట్టుకుని ''అక్కా! ఆర్ యూ ఆల్‌రైట్. ఈరోజు ఎందుకిలా ఎక్సయిట్ అవుతున్నావ్. నేనేదో సరదాకి అంటే అదంతా నిజమేననుకుని ఇంతగా ఆవేశపడాలా. ఆ కళ్ళనీళ్ళేమిటి? డేరింగ్... డేషింగ్‌గా వుండే అపూర్వేనా ఈ అమ్మాయి. నీ పెళ్ళి ఆలస్యమవుతోందని అమ్మావాళ్ళు ఆరాటపడుతుంటే నిన్నో కుదుపు కుదిపి నీలో చలనం తీసుకురావాలని తమాషాగా అలా మాట్లాడేను. అంతమాత్రాన నీ చెల్లెల్ని అంత తక్కువ అంచనా వేసుకోవాలా? నేనో నిప్పుకణికనని నీకు తెలియదా?'' అంది అర్పిత.

''తెలుసు. అయినా ఎందుకో నీ మాటలకు భయపడిపోయాను ఈరోజు'' నార్మల్ కావటానికి ప్రయత్నిస్తూ అంది అపూర్వ.

''నీలో ఈ ఉలికిపాటు, ఈ భయం పోవాలంటే వెంటనే నువ్వు పెళ్ళి కూతురివైపోయి నాకో బావగార్ని తెచ్చిపెట్టాలి. చెప్పు! నీ మొగుడ్ని నువ్వే చూసుకుంటావా? నన్ను చూసిపెట్టమంటావా?''

''పెద్ద ఆరిందాలా మాట్లాడకు. అయినా నా మొగుడ్ని నువ్వు వెదికి పెట్టటమేంటి? వెతికి పట్టుకురావడానికి నేనేమయినా అరేంజ్డ్ మ్యారేజ్ చేసుకోబోతున్నానా?''

ఆ మాటలకు ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టి అలాగే నిల్చుండిపోయింది అర్పిత.

★ ★ ★

ఆరోజే అపూర్వ పెళ్ళి.

పెళ్ళికూతురు ముస్తాబులో అందంగా వుంది అపూర్వ.

పెద్ద ఆర్భాటం, హడావుడీ లేకుండా కొద్దిమంది అతిథులు, స్నేహితుల సమక్షంలో జరుగుతున్న పెళ్ళి గనుక, ఎవరూ హైరానాపడుతున్నట్లు లేదు అక్కడ.

ఒక్కొక్కరుగా లోపలికి వస్తున్నారు ఆహ్వానితులు.

వచ్చినవాళ్ళను అర్పిత సాదరంగా ఆహ్వానించి కూర్చోబెడుతోంది.

సమీర్ కూడా వచ్చాడు. అతని ముఖంలో ఏవేవో భావాలు దోబూచులాడుతున్నాయి.

కళ్ళు పెళ్ళికొడుకు కోసం వెతుకుతున్నాయి ఆరాటంగా.

''ఓ... సమీర్‌గారూ! రండి రండి! అక్క చెప్పింది. సమీర్ వస్తాడు. అతను మన ముఖ్య అతిథి. చక్కగా రిసీవ్ చేసుకో అని. రండి.''

'ముఖ్య అతిథి' అన్న మాటలో ఏదో వ్యంగ్యం వున్నట్లు అనిపించింది సమీర్‌కు.

''రండి. మా బావగార్ని పరిచయం చేస్తాను.''

'బావగారు' అన్న మాట వళ్ళు మండించింది సమీర్‌ను. సూట్‌లో వున్న పెళ్ళికొడుకును చూసి ఆశ్చర్యపోయాడు సమీర్. 'ఇతన్నా..ఇతన్నా..అపూర్వ ప్రేమించి పెళ్ళి చేసుకుంది. ఏముందని ఇతనిలో? హైటు, వెయిట్, పర్సనాలిటీ తప్ప ముఖంలో అందం లేదు. రంగు లేదు, ఆకర్షణ లేదు. ఇవన్నీవున్న నేను పనికిరాలేదు అపూర్వకు' కసిగా, కోపంగా వుంది సమీర్‌కు.

అయినా ఒక పక్కన ఎక్కడో మనసు మూలలో 'బాగయింది. ఇప్పుడు అనాలోచితంగా చేసుకుంటోందిగానీ.. ఆ తరువాత బాధపడుతుంది. నన్ను చేసుకోనందుకు పశ్చాత్తాపపడుతుంది' అనిపించి అదోరకపు ఆనందం కూడా కలిగింది.

''ఓ సమీర్..రా..రా..మీట్ మై హజ్బెండ్ శ్రీకాంత్. ఇతను సమీర్ అని నా ఫ్రెండ్'' అని చిరునవ్వుతో పరిచయం చేసింది

అపూర్వ.

ఇద్దరూ షేక్‌హాండ్ ఇచ్చుకున్నారు. అప్పుడు శ్రీకాంత్ ముఖంలోకి పరిశీలనగా చూసాడు సమీర్.

అపూర్వ తన భార్య అయినందుకు చాలా ఆనందిస్తున్నట్లు, గర్విస్తున్నట్లు అతని కళ్ళు చెబుతున్నాయి.

అపూర్వ ఆనందం చూసి మాత్రం భరించలేక పోయాడు సమీర్. అపూర్వకు షేక్‌హ్యాండ్ ఇచ్చి 'కంగ్రాచ్యులేషన్స్' చెబుతూ కావాలనే ఆమె చెవిలో ''అపూర్వా! యువర్ సెలక్షన్ ఈజ్ మార్వలస్'' అన్నాడు వ్యంగ్యంగా.

''నా సెలక్షన్ ఎప్పుడూ అంతే సమీర్, నా మనసు నచ్చినదై వుంటుంది అది'' అంది అపూర్వ. ఆమె మాటల్లో తొణికిసలాడిన ఆత్మవిశ్వాసం, నమ్మకం మరింత మండించాయి సమీర్‌ను. 'బొకే' అందించి వేగంగా గేటువైపు వెళ్ళిపోతున్న అతన్ని..పరుగెత్తుతున్నంత వేగంతో వచ్చి కలిసింది అర్పిత.

''సమీర్‌గారూ... అదేంటి అప్పుడే వెళ్ళిపోతున్నారు. భోజనం చేసి వెళుదురు గానీ..''

''ఇప్పుడేం వద్దు. కడుపునిండుగా వుంది.''

''ఎందుకు..అక్క పెళ్ళి చూసా. అక్క పక్కన మీరుగాక శ్రీకాంత్ వున్నందుకా..'' అంది చిలిపిగా. గుర్రుగా చూసాడు సమీర్.

''కోపం తెచ్చుకోకండి. భగ్న ప్రేమికులు కదా అందుకని అన్నాను. మీ మనసు గాయానికి ఒక మంచి మందు చెప్పమంటారా. శుభ్రంగా నన్ను పెళ్ళి చేసుకోండి. అపూర్వకీ అర్పితకీ మీకు పెద్ద తేడా కనిపించదు. ఇద్దరం అక్కచెల్లెళ్లం కదా-''

''అర్పితా! నువ్వు నన్ను అవమానిస్తున్నావ్. మీ అక్క దృష్టిలో నీ దృష్టిలో నేనొక చవటలా కన్పిస్తున్నానా-'' అన్నాడు సమీర్ కోపంగా.

తను తమాషాగా అంటున్న మాటలు అతన్ని అంతగా బాధిస్తాయని ముందు ఊహించని అర్పిత నిజంగా చాలా పశ్చాత్తాపపడింది.

''క్షమించండి సమీర్‌గారూ... అయామ్ రియల్లీ సారీ. ఎదుటి వాళ్ళ మనఃస్థితి తెలుసుకోకుండా అలవాటయిన ధోరణిలో అధికంగా మాట్లాడటం నేను చేసిన పెద్ద తప్పు. కానీ సమీర్‌గారూ! ఈ సందర్భంలో ఒక విషయం మాత్రం చెప్పక తప్పదు. అక్కపట్ల మీ మనసులోని ప్రేమ లోతెంతో నాకు తెలియదుగానీ నాకు తెలిసినంతవరకు 'ప్రేమ' అనుకోకుండానో, క్రమక్రమంగానో రెండు హృదయాల మధ్య ఏర్పడే ఒక అనుబంధం. శ్రీకాంత్ మా వీధిలోనే మా ఇంటికి నాలుగిళ్ళ అవతల వుంటాడు. మా రెండు కుటుంబాల మధ్య రాకపోకలున్నాయి. అయితే అక్కయ్య, శ్రీకాంత్‌ల ప్రేమ గురించి నాకు అంతగా తెలియదుగానీ మొన్నీమధ్యనే పెళ్ళి ప్రస్తావన వచ్చినప్పుడు ''నేను శ్రీకాంత్‌ను పెళ్ళి చేసుకుంటాను. అతనంటే నాకిష్టం అని చెప్పింది'' నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే శ్రీకాంత్ పెద్ద అందగాడు కాదు. ఆస్తిపరుడూ కాదు- వీటన్నిటినీ మించి ఒక పెద్ద లోపం అతనిలో వుంది-'' ఆ మాటలకు చటుక్కున తలెత్తి చూసాడు సమీర్.


''లోపమా..''

''అవును. కానీ అది లోపమంటే అక్క ఒప్పుకోదు. అతని కుడికాలు... అది... అది..జయపూర్ కాలు.''

## సైలెన్స్ ప్లీజ్!

**మ్యాచింగ్ జీన్స్, క్యాచింగ్ రొమాన్స్. సో, థియేటర్ ఈజ్ సైలెన్స్- అనిపించడంలేదూ, ఇక్కడ కనిపిస్తున్న అర్జున్ రాంఫల్, దియా మీర్జాలను చూస్తుంటే.**

-గీతా శ్రీనివాస్



''ఆ!''

''అవును. అక్కను నేను ఒకటే ప్రశ్న అడిగాను. ఏం చూసి అతన్ని చేసుకుంటున్నావు అని. 'అతని మనసు చూసి. ఆ మనసునిండా నా మీద వున్న ప్రేమను చూసి' అంది. 'ఎర్రగా, బుర్రగా వున్న నిన్ను చూస్తే ఎవరయినా ప్రేమిస్తారు' అన్నాను. 'ఆలోచించుకోవలసింది నువ్వు' అని హెచ్చరించాను. నా మాటలకు అక్క నన్నో పసిపిల్లను చూసినట్లు చూసింది. 'పిచ్చిదానా! ప్రేమ అనేది మాటలకు, చూపులకు అతీతమైన ఒక మధురానుభూతి. మా అనుభూతికి మాత్రమే అందేటువంటిది. నోరు మాట్లాడుతూ వుంటే మనసు మాట్లాడటం మానేస్తుంది. మనసు మాట్లాడటం మొదలుపెట్టాక నోరు మూగబోతుంది- అని నీ మరో ప్రశ్నకు కూడా జవాబు చెప్పనా' అంది అక్క. ఈసారి ఇంకేం చెబుతుందోనని చెవులు రిక్కించి వుంచాను. 'శ్రీకాంత్‌కు మంచి ఉద్యోగం, ఆస్తిపాస్తులు లేవన్నావు. ఒక విషయం ఇక్కడ నువ్వు మర్చిపోయావు, శ్రీకాంత్ ఒక వీరజవాను. కార్గిల్ పోరాటంలో అతను తన కాలు పోగొట్టుకున్నాడు. ఇంత పెద్ద దేశాన్ని ప్రేమించగల ఆ విశాల హృదయంలో భార్యగా నాకింకెంత ప్రేమ లభిస్తుందోనని ఆశపడ్డాను. తల్లిని ప్రేమించగలిగినవాడు భార్యను సైతం ప్రేమించగలిగిన సంస్కారి అయి వుంటాడు అని నాకో గొప్ప నమ్మకం. తండ్రి యుద్ధభూమిలో ప్రాణత్యాగం చేస్తే ఆ రక్తాన్ని పుణికి పుచ్చుకున్న ఈ కొడుకు ఒక ముఖ్య అవయవాన్ని త్యాగం చేసి ఇంకా ప్రాణాలర్పించే అవకాశాన్ని పోగొట్టుకున్నందుకు బాధపడుతున్నాడు. రెండు సంవత్సరాలుగా నేను ఆ కుటుంబాన్ని అవగాహన చేసుకుంటున్నాను. అణువణువునా, ప్రతి రక్తబిందువునా 'ప్రేమ'ను జీర్ణించుకున్న ఆ కుటుంబంలోకి కోడలిగా వెళ్ళడాన్ని మించిన అదృష్టం మరేముంటుంది చెప్పు. ఆ అదృష్టవంతురాలు మరెవరో కాదు మీ అక్క అంటే నీకు మాత్రం గర్వంగా లేదూ' అంది అక్క'' అర్పిత ఉద్వేగంతో చెప్పింది.

ఇంకా వుంటే ఇంకా ఏం చెప్పేదో గానీ 'అర్పితా' అని ఎవరో పిలవడంతో వెళ్ళిపోయింది. వెళ్ళిపోబోతున్న సమీర్ ఒక్కసారి మంటపంలోని ఆ జంటను చూసి మనసారా దీవించాడు.